# కుంకుడాకు

అప్పలనాయుడు కూతురు పారమ్మ. చినదేముడు కూతురు గవిరి ఊళ్ళోంచి పొలాల్లోకి పోతున్నారు. అప్పలనాయుడు మోతుబరి రైతు. చినదేముడు గోచిపాతరాయుడు. అంచేత పారమ్మ చింకి పరికిణీ కట్టుకుంది. గావంచా పైటేసుకుంది. గవిరి గోచీ పెట్టుకుంది. కంపకట్టా, తట్టా పట్టుకుంది. పారమ్మ మెళ్ళో పగడాలున్నాయి. చేతులకి కాళ్ళకి సిల్వరు కడియాలున్నాయి. గవిరి ముక్కు గోక్కుంది. దాని ముక్కులో రాగికాడలున్నాయి. పారమ్మ ముక్కుకి చెవులకి బంగారపు కాడలున్నాయి.

"సెద్ద రుసిగా వుంది" అన్నది పారమ్మ.

"ఏటి?" అనడిగింది గవిరి.

"ఊరగాయ."

"ఎక్కడిది?"

"మాయయ్యకి బుగతగోరిచ్చారు."

వాళ్ళయ్య అప్పలనాయుడు. అంచేత బుగతలు ఊరగాయ అడిగినా ఇస్తారు. కూర అడిగినా ఇస్తారు.

"నాను రెయ్యిలు నంచుకొన్నాను" అన్నాది గవిరి. అబద్ధమాడింది. గొప్పకి అబద్ధమాడింది. పారమ్మ చింకిపరికిణీని మచ్చరంతో చూసి తన గోచీని తడువుకొంది.

"ముండాగొప్ప! ఎవిడికీ తెల్దనుకున్నావు గావాఁల, గింజలునేక రేత్రి మీరగ్గేసుకోనేదు. మాయయ్య సెప్పినాడు. తాగడానికి దప్పికనేదు రెయ్యిలు నంచుకొంది రెయ్యిలు," అని పారమ్మ కిందికీ, మీదికీ చేతులు ఎగరేస్తూ ఎత్తిపొడిచింది.

"నిన్న రేతిరి మీకూ కూడునేదు" అన్నాది గవిరి. మాటకి మాట అన్నాది.

"నిన్న రేతిరి మాకు కూడు నేదూ? ఓసి లమిడీ! ఎవిడు సెప్పినాడు? మాయమ్మ నడుగు. రేత్రి మునేళం సేపలపులుసు, వారన్నం తిన్నాం" అన్నాది పారమ్మ. వాళ్ళయ్య ఊళ్ళోకి పెద్దనాయుడు. సంతకెళ్ళి పులుసు లోకి మునేళం, ఇగురికి చందువాలు తెచ్చాడు.

చిన్నబోయి గవిరి కళ్ళాలవేపు తిరిగింది. పారమ్మ కూడా చేతు లూపుకుంటూ వెంబడించింది. ఊళ్ళో బడిపిల్లలు ప్రార్థన మొదలెట్టేరు.

"తల్లీ నిన్నుదలంచి" అని మేష్టారందిస్తున్నారు.

"తల్లీ నిన్నుదలంచి" అని పిల్లలంతా ఒక్కమాటు పూలెగరగొడు తున్నారు.

పారమ్మా, గవిరి గోర్జలోకెళ్ళారు. తోవచూచుకుంటూ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గోర్జవార వేళ్ళా, వూడలూదించి మొగలి పెండి ఉన్నాది.

"నాను మంగళారం బడికెళతాను. అయేల మంచిరోజు. మేష్టేరు గోర్యే పంపమంటే మాయయ్య పంపుతానన్నాడు" అన్నాది పారమ్మ.

"ఎందుకు ముష్టి సదువూ?" అన్నాది గవిరి.

"సదువెందుకా ? ఇను ఇను ఎనాగ పాడుతున్నారో!"

"మాయయ్యనీ మేష్టేరుగోరడిగినారు. కూలిసేసుకొనే వోళ్ళకి సదు వెంటికన్నాడు మాయయ్య."

"అవును మీయయ్య కూలోడు. మాయయ్య నాయుడు."

గవిరికి గొంతుకలోకి ఏడుపూను, కళ్ళలోకి నీళ్ళు తోసుకొచ్చాయి.

బలుసుతుప్పలో ఊసరవిల్లి పెదచప్పుడు చేసింది. కోరడిలో పచ్చ గన్నేరు నిండా పువ్వులు పూసి గోర్జనిండా సగం రాల్చింది. పార నాలుగు పువ్వులు ఏరి తల్లో దోపుకుంది. గవిరి కూడా ఏరుకుని తురుముకుంది. దాని చేతికి ముంతంత ముచ్చటిముడి తగిలింది.

"ఒలే పారా సూడు, నాకు ముంతంత కొప్పున్నాది. నీ బుర్రమీద ఎంట్రుకలే నేవు" అన్నాది. పారమ్మ చూచింది.

"కొబ్బరిపీచు నాగెందుకు ? నా తల సూడు, ఎంత నూన రాసు కున్నానో, నీ తలకి నూనే నేదు" అన్నాది పార.

బడిపిల్లలింకా గొంతుక చించుకుంటూ ప్రార్థిస్తున్నారు. పార ఘూనురాగం తీసింది.

"సరస్వతీ" అన్నారు బడిపిల్లలు.

"సరస్వతీ" అన్నాది పార.

"నమస్తుభ్యం" అన్నారు బడిపిల్లలు.

"నమత్తుబ్బెం" అన్నాది పార.

"నువ్వు పాడుకుంటూ కూకో, నాను కంపలేరుకోవాలి" అని గవిరి తళ్ళాలకి తోవతీసింది. పార వెంటపడ్డాది. గవిరి ప్రాయం ఎనిమిదేళ్ళు. కాని దాని నెత్తిమీద కొండంత సంసారభారం వున్నాది. చిన్న దాక నెత్తి మీద పెట్టుకొని కోనేటికిపోయి ఇంటికిపడే నీళ్ళలో సగం అదే మొయ్యాలి. తట్ట పట్టుకొని పెండలంట, తోటలంటా పోయి ఆకు అలమా, కర్రా, కంపా ఏరి ఇంటికి ఒక పూటకి సరిపడే వంటచెరుకు తేవాలి. ఆ బాధ్యత లని గవిరి మోసివున్నాది.

పక్కపొలాల్లో పెసరకాయలు గుత్తులు గుత్తులున్నాయి. పారమ్మ నాలుగు మొక్కలు పీకి కాయలేరుకు తింటున్నాది. గవిరి కడుపులో కాల్తు న్నాది. దానికి ఆవేళ దప్పికలేదు. అంతకుముందు రాత్రికూడా తిండిలేదు.

"ఓలమ్మ ఆకలేవ్!" అంటూ రాత్రెంతో ఏడ్చింది.

"ఓ లేదవకే, ఇంట్లో ఏటీనేదు" అని ఓదార్చింది వాళ్ళమ్మ. ఏడ్చి ఏడ్చి ఆఖరికి ఆకలినిద్ర పట్టిపోయింది.

గవిరి కూలివాడి కూతురు. పొలాల్లోపడి దొంగతనంగా తినడాన్కి ధైర్యం చాలదు. నాదారులు ఆ రకం చిన్న దొంగతనాలు చేస్తే పెద్ద నేరాలు అవుతాయి. ఉన్నవాళ్ళు చేస్తే కమ్మకుపోతుంది. పారమ్మ చెట్లు పీకి తోవకడాకూ తింటున్నాది. దానికి నిర్భయం.

"ఆళ్ళు సూస్తే టెంకి మాడుతుందిలే" అన్నాది గవిరి.

"సూసినోడెవడు? సూసినా నానప్పలనాయుడు బొట్టిని. ఆళ్ళ మొకం ఏటంటారు?" అన్నాది పార. గవిరి కడుపులో కర కరలాడు తోంది. దాని కళ్ళకి సత్తుగిన్నెతో నిండా గిన్నెడు గంజి, నంచుకోడాన్కి ఎండుమిరపకాయ కనపడ్డాయి. ఎక్కణ్ణుంచి వస్తాయి? వాళ్ళయ్య చిన

దేముడు కూలి ఏమైనా తెస్తే రాత్రికి తిండి, లేకపోతే ఆరోజు పస్తుపడుకో వలసినదే. గవిరి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

కుంకుడుచెట్టు తోవనిండా ఆకులు రాల్చింది. కుంకుడాకుల్ని చూచి గవిరి ఆకలి మర్చిపోయింది. అన్ని ఆకుల్లోకి కుంకుడాకులు చాలా దళసరివి. నాలుగాకులు ఏరితే తట్ట నిండుకుంది. ఆకులన్నీ తుడిచి తట్టలో కెత్తి నొక్కి కుక్కింది. దాని బాధ్యత ఆ పూటకి అయిపోయింది. తట్ట బరువుగా నిండింది. దాని గుండె తేలికైంది. ఇద్దరూ ఇంటికి తోవతీశారు. పారమ్మ పొలికేకలేస్తూ బయలుదేరింది. కాంభుక్తగారి కళ్ళాం చేరుకున్నారు. కళ్ళాం వారనుంచి చింతకింద పడిపోతున్నారు. వాళ్ళ ముందు టప్పని ఏదో పడ్డాది.

"ఓలమ్మో తేలు!" అని తుళ్ళిపడి కేకేసింది పార.

"తేలు కాదు పీత" అన్నాది గవిరి.

ఏ కొంగనోట్లోంచి పడ్డాదో! గవిరి చింతలలోకి చూచింది చింతల శిఖరాలు కొంగలతో నిండివున్నాయి. చింతలు తెల్లతామరలసి పూసినట్టున్నాయి.

"ఎన్ని సింతకాయలో!" అంది గవిరి. పారమ్మ తలెత్తి చూచింది. దాని నోరూరింది. రాళ్ళు తీసి కొట్టింది. మూడు కాయలు రాలాయి. ఒక కాయ కొరుక్కుని రెండు కాయలు చింకి పరికిణీలో దోపుకొంది.

"ఒలే పారా నాకో కాయెట్టవు?" అనడిగింది గవిరి.

"నువ్వూ కావలిస్తే కొట్టుకో" అన్నాది పార.

"ఒలే ఒలే" అని గవిరి ప్రాధేయపడ్డది.

"అయేటిరాళ్ళు" అని పారమ్మ తోవతీసింది. తలెత్తి చూచింది గవిరి. కొడవళ్ళలాగ ఊగుతూ కాయలు వేళ్ళాడుతున్నాయి. గవిరి భయపడుతూ ఒక రాయి విసిరింది. ఆ రాయి దబ్బున కిందపడ్డాది. ఆ చప్పుడికి మరింత భయపడిపోయి నాలుగు పక్కలా చూసింది. పారమ్మ మళ్ళా పెసరకాయలకి పొలాల్లో పడ్డాది. గవిరి మరోరాయి విసిరింది. కాయలు రాలకపోయినా పెద్ద ఎండుకొమ్మ చెట్టుమీంచి గలగల మని జారి కింద పడ్డాది.

గవిరి చంకలు కొట్టుకుంది. "ఆయిదెబ్బ" అని ఆ కంపమీదికి

ఒక్క పిల్లిగంతు వేసింది. కొమ్మని చితుకులుగా విరిచి తట్టమీద పెట్టుకొంది.

"ఎవరక్కడ?" అని కళ్ళంలోంచి కేక వచ్చింది. గవిరికా కేక పిడుగులాగ వినపడ్డాది. కళ్ళంలోకి సూసింది. ఎదురుగుండా కాంభుక్త గారు నిలబడి ఉన్నారు. ఓచేత్తో నెత్తి గోక్కుంటూ, రెండో చేతినేమి చేయడమో తెలియక గవిరి వింటిల్లిబద్దలాగ వొంగిపోయింది. భుక్తగారు చింతనిప్పులు రాలుస్తూ చూస్తున్నారు.

"పొయినోకి" అని వొణుకుతూ గవిరి చెప్పింది.

భుక్తగారు మీదకెళ్ళాడు. తట్టలో కుంకుడాకు, మీదని చింతకంపా కనపడ్డాయి. అతను పాంకోడిమీద కాలు ఎత్తాడు. తట్టని సత్తువపూరా "కిక్కు" తన్నేడు. తట్టా ఆకు ఎగిరిపోయాయి. గవిరి గడగడ లాడుతూ తట్ట తీసుకుంది. మళ్ళా ఆకు నొర్లుకోపోయింది.

"లమ్డీకానా ఇంకా ఎత్తుతున్నా?" అని ఉరిమాడు. గవిరి ఏరిన ఆ చెత్తకి ఎంత విలువ ఉన్నదో అతనికి తెలియదు. చిన దేముడి సంసారానికి కూతురు గవిరి తెచ్చిపెట్టే ఆ చెత్తకి ఆర్థికంగా ఎంతయినా విలువ ఉన్నది. ఆ చెత్త ఒక పూట పొయ్యిలోకి చాలు. ఆ సంగతి గవిరికి తెలుసు. ఎనిమిదేళ్ళదే అయినా ఆ బాధ్యతను గవిరి ఎరిగి ఉన్నది. ఆ చెత్తకోసం దాని ప్రాణం తహతహ లాడిపోయింది.

"బాబుగోరూ! మరెప్పుడూరాను" అని ప్రాధేయపడ్డాది. భుక్త గారు చుట్టూ చూశారు. ఆయనకి ఆచోకీ దొరికింది.

"ఏమిటే ఆ తుప్పవార దాచేవ్?" అనడిగాడు.

"నానేటీ దాచనేదు" అతను చేతికర్రతో తుప్పనెత్తేడు. దానివార తట్టెడు పేడ బైటపడ్డాది. దొంగతనం బైటపడిపోయింది. చేతికర్రతో టొక్కటి వెన్నుమీద వేసి "ఏమిటీ అది?" అనడిగాడు.

"అమ్మోయ్ సచ్చిపోనాను. నానుకాదు బాబోయి" అంటూ ఏడుపు మొదలెట్టింది.

"ఇంకెవరే లంజకానా?" అని మరొక్కటేశాడు. గవిరికి బోధపడ లేదు. తనుకాదని చెప్పినా భుక్త తంతున్నాడు. అతనికి చెప్తే తెలియదేమో అని నివ్వెరపడ్డది.

ఏడుపులోంచి పౌరుష మొచ్చింది. అది దొంగ కాదు. అంచేత ధైర్యమొచ్చింది. ఏడుపు మాని కళ్ళెర్రజేసి :

"నానుకాదు నా తట్టా సేతులూ సూడు" అన్నాది. దాని తట్టనీ చేతులనీ పేడమరకలు లేవు. కళ్ళంలో పాలేర్లే ఆ పని చేశారు. కాని భుక్త గారి బుద్ధి వికసించలేదు. కర్రతో మరొక్కటేశాడు. అది వక్కాణించి చెప్పినా కొట్టేడు.

"ఓ ర్నంజకొడకో! నానుకాదు. ఓలమ్మో నానుకాదు. ఓ ర్నంజ కొడుకో!" అంటూ గవిరి తిట్లు ప్రారంభించి బూతుల్లోపడ్డాది. మహా మహా వాళ్ళని పాతీసిన భుక్తగారిని గవిరిగుంట బూతులు తిట్టడం మొదలెట్టింది.

భుక్తగారు పాంకోడు తీసిపెట్టి విసిరేడు. దాని పిక్కమీద ఎమికెకి ఖట్టని తగిలింది. అది బోర్లాపడి మన్ను కరచుకొంది. పీక తెగ్గోసిన కోడి లాగ గిలగిల కొట్టుకొని చుట్టుకుపోయింది. దాంతోటిక భుక్తగారు సంతృప్తి పడి వెళ్ళిపోయారు.

ఏడ్చి ఏడ్చి గవిరి కళ్ళు తెరచింది. పొద్దు లేచిపోతోంది. బడిలో పిల్లలు ఎక్కాలు వల్లెవేస్తున్నారు.

"మూడేళ్ళిరవై య్యొకటి" అంటూ అంతా అరుస్తున్నారు. ఎక్కాలు పాడుతూ వల్లెవేస్తున్నారు.

గవిరి కళ్ళాంలోకి చూసింది. ఎవరూ లేరు. కిందని విరజిమ్మివున్న కుంకుడాకుని కూడతీసింది. ఆకు వొదిలితే పొయ్యిలోకి సాధనంలేదు. తల్లీ తండ్రీ పొయ్యిమీదికి తేగలిగినా, తేలేకపోయినా గవిరి పొయ్యిలోకి తెచ్చితీరాలి.

"లమిడీ కొడకా! నీ సింతకంప లెవిడికీ అక్కరనేదు!" అని చింత కంపలు వొదిలేసింది. తట్ట నెత్తిన పెట్టుకొంది. కాలు మండిపోతోంది. అప్పుడు వొంగి దెబ్బని చూసుకొంది. ఎమికమీద పాంకోడు దెబ్బ పెద్ద బొప్పికట్టింది. బొప్పిమీద చిట్లి ఎర్రగావుంది.

"ఓలమ్మో!" అంటూ మళ్ళా ఉక్కిరిబిక్కిరిగా ఏడ్చుకుంటూ గోర్జలోకెళ్ళింది. బడిపిల్లలింకా ఎక్కాలు పాడుతున్నారు.

"పదహారార్లు తొంభైయారు" అని ఒకరు అరుస్తున్నారు.

"పదహారార్లు తొంభైయారు" అని అంతా కలిసి పాడుతున్నారు.